# వీలునామా

## కొవిలిపాటి విజయలక్ష్మి

"పండగకి నేతచీరా కొన్నారు? చిన్న పిల్లకి ఏ వాయిలుచీరో అయితే బాగుంటుంది కాని..." అని కుడిచేత్తో బుగ్గలు నొక్కుకుని ఎంతో ఆశ్చర్యం ముఖం నిండా పులుముకుని అడిగింది అలివేలు తాయారు సుశీలని.

'నిజమే పండగకి ఉత్త నేతచీరా అనిపించింది'ఓసారి అయినా పోన్లె నాకు చాలా మంచి మంచి చీరలున్నాయి, అని సరిపెట్టుకుంది.

అదే మాట నాలుగు రోజులు సుశీల వంటరిగా ఉన్నప్పుడు ఇరుగు పొరుగు అమ్మలక్కలు అనే సరికి 'నిజమే ఓమంచి చీర కొనరాదూ! మామగారికేం డబ్బులేదా పోదా' అనిపించి ఆ రాత్రి భర్త చెవిన వేసింది సుశీల 'మీపిన్నమ్మ బుద్ధి చూడండని'

"పోన్లెద్దూ ఏదోచీర, అతను ఇవ్వాళో రేపో అనేట్టున్నాడు.ఆవిడ పెత్తనం"అని విసుక్కొన్నాడు శంకరం.

'చాలా రోజులుగా నువ్వూ, భార్యా ఓసారి వచ్చి నన్ను, నేను అనుభవించే నరకాన్నిచూసి తృప్తిపడి వెళ్ళు' అని తండ్రి ఉత్తరాలు వ్రాస్తున్నాడు. అతను అనుభవించే నరకాన్ని చూసి తృప్తిపడే కాఠిన్యం తనలో లేదు. అతనంటె అభిమానం, ప్రేమాలూ ఏవీ కూడా లేవు.

ఎలా ఉంటాయి? తను కోరుకున్న బట్టలు- కనీసం జీడిపప్పు పంచదార అచ్చు అతనెప్పుడన్నా స్వతంత్రించి కొనగలిగాడా? వరాలు ఎంత చెబితే అంత. వరాలంటె అతను తెచ్చుకున్న భార్య- లేదా ఉంపుడుగత్తెగా వచ్చి భార్యగా స్థిరపడింది. ఆ ఊహ వచ్చేసరికి శంకరరావు గుండెల్లో మంట రేగింది. ఆ క్షణంలోనే లేచి వెళ్ళి పోవాలనిపించింది. కాని తమాయించుకున్నాడు. ఏం చేస్తాడు,అసలు తన తండ్రిలో ఉన్న బలహీనత అది. అతన్ని అనుకుంటారందరూ.వయసున్న ఆడపిల్లలవైపు వాపుగా చూస్తాడని, స్త్రీని చూస్తే ఆగిపోతాడనీ నవ్వుకుంటారు. అతనిలోని బలహీనతను తనూ అసహ్యించుకుంటాడు. రెండు మూడు సార్లు అన్నాడు కూడా విసుగ్గా. "వయస్సు మళ్ళింది మీరు రిజర్వ్డుగా ఉండాలి నాన్నా!" అని.

అయినా అతని స్వభావమంతే హాస్పిటల్లో ఇంజక్షను చేసే నర్సువైపు వెకిలిగా చూసేవాడు. ఆడడాక్టరయితే అతనామె ప్రశ్నలకి ఏం జవాబు చెబుతున్నాడో అతనికే తెలియదు.

సుశీల ఇంకా ఏమో చెప్పబోతూంటె కసురుకున్నాడు "షటప్ నోరుముయ్యి వెధవ చీరసోది" అని.

వాళ్ళుండే లొకాలిటీయే అంత మంచిది కాదు. తన తండ్రి కంతకన్నా మంచి చోట ఇల్లు దొరకదు. తను సాధారణంగా తండ్రి ఇంటికి రావటం మానేశాడు.



ఒకటి పరాన్ని చూసేటం, ఆమె చేతి అన్నం తినటం తనకు అసహ్యం తన తల్లి పోయాక తండ్రి తనూ బాలమ్మ హోటల్లో భోజనం చేసేవారు అదొక చవక హోటలు బాలమ్మ రవిక తొడుక్కోకుండానే వడ్డన చేసేది. టీ బళ్ళ మీద ఈగలు ముసురుతూ హోటలు గలీజుగా ఉండేది అయినా నాన్న ఆ హోటలుకే భోజనానికి వెళ్ళేవాడు నాన్న బాలమ్మతో హాస్యాలాడేవాడు. తనకప్పుడు తొమ్మిది పది సంవత్సరాల వయసుంటుందేమో! రంగనాధం బడిలో చదివేవాడు. రాత్రి పది పన్నెండు గంటల

వరకూ తను ఒక్కడే కిట్టుగదిలో బుడ్డి దీపం ముందు కునికిపాట్లు పడుతూ పుస్తకం ముందేసుకుని కూర్చునేవాడు. నిద్రపోయి తలుపు తియ్యడం ఆలశ్యం చేస్తే నాన్న బాదేసేవాడు. అందుకని భయంతో కునికిపాట్లు పడుతూ కూర్చునేవాడు. నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకోవటానికి చాలా ప్రయత్నాలు చేసేవాడు. ఒకరోజు వెంకటావధానిగారి ముందు ప్రమాణాలు కూడా చేశాడు. తనకు బాగా జ్ఞాపకం, వెంకటావధాని "ఆ అమ్మాయికి తల్లి తండ్రులు లేరు. మరి మరి. మీరు" అనే సరికి "ఆ అమ్మాయిని నేను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను. మా కుర్ర వెధవని కావలిస్తే ఏ హాస్టలు స్కూల్లోనో పారేస్తాను ప్రమాణం చేసి చెబుతున్నానుగా." నాన్న గబగబా, "కానీ..." అని వెంకటావధాని నసగటంతో "వెధవా నువ్వు అవతలికెళ్ళు" అని తనను అదరిపడేట్టు కసిరాడు నాన్న. తను అవతలికి వెళ్ళిపోయాడు. తరవాత వెంకటావధానీ నాన్నా ఏం మాట్లాడుకున్నారో తనకు తెలియదు.

మరి నాలుగు రోజులనాడు బడినుంచి వస్తున్న తనకి సందు చివర ఆపేసి "ఇది నిజమేనా?" అని తన చెవిదగ్గర చెయ్యి అడ్డం పెట్టి గుసగుసగా అడిగాడు అవధాని. నిజమే అన్నట్టు తలూపేశాడు— అంతె ఆ పెళ్లి సంబంధం ఫెయిలయింది.

తరవాత కూడా పెళ్లి చేసుకోవాలని చాలా తాపత్రయపడేవాడు. కాని అవలేదు. తనకు పన్నెండేళ్ళ వయసువచ్చిన దగ్గర నుంచీ వంట ఇంటి, పనులు తన చేత చేయించేవాడు.

కొంత కాలం వరాలు బాగా చీకటి పడ్డాక అందరూ నిద్రపోయి వీధి సందడి సద్దుమణిగాక వచ్చి తెల్లవారుఝాము వెళ్ళి పోయేది. చదవరా వెధవా అని రాత్రి పన్నెండయినా నిద్రపోనివ్వని నాన్న రాత్రి ఏడు గంటలయినదగ్గర నుంచి ఇంక పడుకో వెధవా చదువు చాలు అని కసిరి నా చేతిలో పుస్తంలాగేసే వాడు. ఓనాడయితే తను శీనుగాడి దగ్గర ఎరువు తెచ్చుకున్న నోట్సు పుస్తకం చింపేశాడు నాన్న. మర్నాడు మళ్ళీ శీనుగాడికి పుస్తకం ఇచ్చెయ్యాలి కదా అని రాత్రి ఎనిమిది గంటలు కావస్తున్నా, నాన్న పడుకోరా వెధవా అంటూన్నా వినిపించుకోకుండా రాసుకొంటున్నాడు. వరాలు వచ్చేసింది.

నాన్నకి నా మీద పట్టరాని కోపం వచ్చేసింది.

మర్నాడు శీనుగాడు మేష్టరుగారికి పుస్తకం చింపేశానని పిర్యాదు చేస్తే మేష్టరు చెయ్యిచాపమని వెదురు బద్దతో అర చేతిలోను, వంటిమీద కొడుతుంటే ప్రాణం విలవిలలాడి "నేను కాదండీ ఆ పుస్తకం మా నాన్న చింపేశాడు" అని చెప్పేశాను.

వెధవా అబద్ధాలాడతావు మీనాన్నెందుకు చింపుతాడురా నీనోట్సు అని మరో నాలుగు తన్నాడు మేష్టరు. తనతోటిపిల్లలు అంతా పళ్ళికిలించి నవ్వారు. "పోనీ, నేను మళ్ళీ రాసుకుంటాను" వాణ్ణి కొట్ట

కండి మెష్టారూ!" అన్నాడు శీనుగాడు జాలిపడిపోయి.

అప్పటినుంచీ పిల్లలెవరూ నాకు నోట్సులు ఇంటికి ఇచ్చేవారు గాదు. వాళ్ళ ఇంటికి వెళ్ళి వ్రాసుకునే వాణ్ణి అవసరమయితే.

తర్వాత నాన్న పరాన్ని బాహాటంగా ఇంటికి తెచ్చేసుకున్నాడు. పరాలే మా ఇద్దరికే వంట చేసి పెట్టేది. పరాలు. పరాయి కులం పిల్లకావటం వలన అనుకుంటాను బంధువులెవరూ మా ఇంటికి రావటం మానేశారు. అప్పుడప్పుడు నన్ను చూడటానికి అమ్మమ్మ వచ్చేది. ఆవిడకూడా రావటం మానేసింది. చార్జీలకి నాదగ్గర డబ్బులు లేవు కనుక నేనూ వెళ్ళలేదు.

అమ్మమ్మ పోయిందని తెలిసిన రోజు ఎంత ఏడ్చానో. అమ్మమ్మ నన్ను కావలించుకుని కనుల నీరు నింపుకోవటం నాకు బాగా గుర్తు. అమ్మవాళ్ళు పోయి నేను తేరుకున్నాక అమ్మమ్మ తీసుకుపోయి పెంచుతానని నాన్నను అడిగిందట. నన్ను వప్పుకోలేదట. బహుశా అతని రహస్యం బయట పడుతుందని కాబోలు.

ఆనాటి సంఘటన నా జీవిత కాలం అంతా గుర్తుంటుంది. అమ్మకి నాన్నకీ పోట్లాట లేనిరోజు ఉండేదికాదు. పండగ రోజుల్లో కూడా వాళ్ళు సరదాగా గడపటం నేను చూడలేదు. అమ్మ నాన్నలో కలిసి సినిమాకు కనీసం బంధువులింటికి వెళ్ళటం కూడా నేనెరుగను. అందరూ అనుకునేవారు. నాన్నకు చెడు తిరుగుళ్ళు ఉన్నాయని, అందుకే అమ్మని అలా హింసిస్తాడనీను.

నాన్న ఎంతకను తిరిగే చెడు తిరుగుళ్ళకు అడ్డుతగలేదని, వెధవ పనులను వారించేదనీ ఆమెను పొట్టపెట్టుకున్నాడు.

ఆరోజు ఉదయం నుంచీ అమ్మా నాన్నల మధ్య తగువు. అక్క బిక్కుబిక్కుమని చూస్తూ ఉండుండి ఊరుకోమ్మా! అనేది. అక్క ఎంత అందంగా ఉండేదో! పద్నాలుగేళ్ళ అక్కయ్య బంగారు బొమ్మలా ఉంటుందని అనేవారందరూ.

"నువ్వుండవే ముండా. ఇవాళ పని అంతుచూస్తాను" అని అమ్మ మీదికి విజృంభించారు నాన్న. అక్క, అన్నయ్య, నేనూ ఒకేసారి గట్టిగా అరవబోయి నోటికి చేతులు అడ్డం పెట్టుకున్నాం.


అరుస్తే ఏం జరుగుతుందో మాకు తెలుసు. నాన్న మమ్మల్ని చితకతంతాడు.

"ఈ బాధలింక నేను భరించలేను. పిల్లల్ని చంపి నేను చస్తాను" అంది అమ్మ.

"చావు ఇవాళే చావే" అని అమ్మని మరొకటి వేసి వీధిలోకి వెళ్ళి పోయారు నాన్న.

"ఛీ! వెధవ మొగుడు, వీడితో కాపురం చేసేకన్నా చావటమే మేలు" అంది అమ్మ. కనులు ముఖం చీర చెంగుతో తుడుచుకుంటూ.

ఏదో కోపంలో ఆవేశంలో అలా అంది కాని అమ్మ అంతపనికి తెగిస్తుందని అనుకోలేదు నేను.




సాయంత్రం అవ్వాళ మా కందరికీ ఇష్టమైన బొబ్బట్లు చేసిపెట్టింది. ఆమె కనుల తడి ఆరటమేలేదు, నాన్న తిట్టాను కొట్టారు అందుకే అమ్మ ఏడుస్తుందని సరిపెట్టుకున్నాం. "ఇవాళ బొబ్బట్లెందుకమ్మా చేశావు? అడిగింది అక్క."

"ఉత్తినేనే తింటారని," అని నవ్వింది అమ్మ. నాకు తప్ప మిగతా వారందరి జీవితం ఆ రోజుతో ముగిసి పోతుందని అనుకోలేక పోయాను.

తృప్తిగా బొబ్బట్లతో భోజనం చేశాం. తలా కొంచెం పాలు తాగి నిద్రపోండి అని రాత్రి ఎనిమిది గంటలవేళ మేం చదువుకుంటూన్నప్పుడు తెచ్చి ఇచ్చింది అమ్మ. అప్పుడప్పుడు నాన్న చేత మేం దెబ్బలు తిన్నప్పుడు అమ్మ పాలు ఎక్కువ కొని మాకివ్వటం అలవాటే.

పాలు తాగేశాం, మిగతా వాళ్ళ విషయం నాకు తెలియదు గాని నాకు మాత్రం వికారం పుట్టింది

తర్వాత భళ్ళున వాంతి అయింది. నాన్న వచ్చారు. అప్పటికి నేను తప్ప అమ్మతో సహా అందరూ నిద్రపోయినట్లె ఉన్నారు.

"ఏరా! వెధవా ఏమయ్యింది!" అడిగారు నాన్న.

జరిగింది చెప్పేశాను నాన్నతో - అబద్ధాలాడకూడదని.

"నా గురించి నేను అమ్మని, మిమ్మల్ని ఇబ్బంది పెట్టేవాణ్ణని ఎవ్వరితోనన్నా అన్నావో జాగ్రత్త పళ్ళు చీరేస్తాను" అన్నారు నాన్న. అలాగే అన్నట్లు తల ఊపాను. ఎప్పుడూ లేని కంగారు తడబాటు నాన్నలో చూశాను.

తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు.

హాస్పిటల్ బెడ్ మీద నాకు తెలివి వచ్చి కనులు విప్పేసరికి నా మంచం పక్కన నాన్న తప్ప అమ్మ అక్కయ్య అన్నయ్య లేరు.

వాళ్లు ఈ ప్రపంచం నుంచి బాధల నుంచి వ్యథలనుంచి దాటి పోయారు.

స్టేట్‌మెంటు నాకేం తెలియదనే ప్రతి ప్రశ్నకూ జవాబిచ్చాను. రాత్రి పాలు తాగానని చెప్పాను. ప్రతిరోజూ మీకు పాలు తాగే అలవాటుందా అని అడిగిన ప్రశ్నకు జాతీరాని లా తబూ ఫేకాను అలవాటుం [illegible]

తర్వాత ఆ కేసు ఏం చేశారో నాకు తెలియదు.

కొంత కాలం తరవాత పరాత్మి పల్లిగా తెచ్చేసుకున్నాడు నాన్న. పరాలు వంట నేను తిననని తిరగబడ్డాను. ఏమిటో అదంటే నాకసహ్యం. కొట్టి తిట్టి నన్ను దారికి తేలేక వేరే ఊర్లో బడిలో నన్ను చేర్పించాడు నాన్న.

నెలకింత అని డబ్బు పంపించేవాడ తను. దానితోనే సర్దుకునే వాణ్ణి నేను. బట్టలు కూడా సంవత్సరానికి మూడు నాలుగు జతలు కుట్టించేవాడు నేను ఎవ్వరూ ఆత్మీయులు లేనివాణ్ణవటం వలన కాబోలు నాతోటి విద్యార్థులందరితోనూ సఖ్యంగా ఉండేవాణ్ణి.

నేను అద్దెకు ఉండే ఇల్లుగలావిడ మహాలక్ష్మమ్మగారు నన్ను చాలా ఆప్యాయంగా చూసేది. పండగ లేవయినా వస్తే భోజనానికి పిలిచేది. ఆవిడ ఎలిమెంటరి స్కూల్లో టీచరుగా పనిచేసేది. ఆమె, ఆమె తల్లి, ఆమె కూతురు మాత్రం ఆ ఇంట్లో ఉండేవారు. ఆమె బొట్టుపెట్టుకునేది. పువ్వులు పెట్టుకునేది కాని ఆమె భర్త నేనా ఇంట్లో ఉన్నంత కాలం ఎప్పుడూ రాలేదు. ఆమె కూతురు ఆమెతో పాటే స్కూలుకి వెళ్లి వస్తూండేది. నాకు ఆ పిల్లతండ్రి ఎవరో తెలుసుకోవాలనే కుతూహలం. ఓ రోజు ఆ పిల్ల పెరట్లో జామిచెట్టు కింద లక్కపిడతలు పెట్టుకుని ఆడుకుంటూంటె ఆ పిల్ల అమ్మ, అమ్మమ్మ ఇంటి పనుల్లో ఉన్నప్పుడు అడిగాను

"పాపా మీ నాన్నగారు?" అని నేను అనేంతలో లేరు అని చెప్పిందా అమ్మాయి.

అయితే వాళ్ళమ్మ పువ్వులు; ముఖాన బొట్టు ఎందుకు పెట్టుకుంటూంది? అదే ఒక పెద్ద ప్రశ్న నన్ను వేధించసాగింది

నాతో క్లోజ్‌గా ఉండే ఓ స్నేహితుణ్ణి అడిగాను. మా ఇంటి గలావిడ మొగుడెక్కడుంటాడ్రా అని.

వాడు వెంటనే రాడేపల్లి గూడెంలో అన్నాడు.

నేను కనులు పెద్దవిచేసి ఆశ్చర్యంతో వాడివైపు చూస్తూ "మరి ఎప్పుడూ రాడేం?" అడిగాను.

దానికి వాడు పకపకా నవ్వి "ఎందుకు వస్తాడు? అతనికి భార్యాపిల్లలు ఉన్నారట. ఈవిడంటె అతను సరదా పడ్డాడట ఆవిడ కూడా మోజుపడిందట. అమ్మాయి పుట్టేసింది. అతను ముఖం చాటు చేసుకున్నాడు. ఈవిడ ఉద్యోగం సంపాయిం




చుకుంది ఇది పెద్దలు చెప్పుకునే కథ. అన్నాడు.

నాకు ఎందుకో ఆవిడా ఆపిల్ల అంటే ఆనాటి నుంచీ జాలి పుట్టుకు వచ్చింది. జీవితంలో వాళ్ళ కేమయినా ఉపకారం చెయ్యాలని అనుకునే వాణ్ణి.

చదువు అయి ఉద్యోగస్థుణ్ణి అయ్యాను. నాకు సంప్రదాయ కుటుంబాలనుకునే వారెవరూ పిల్లనిస్తామని ముందుకు రాలేదు. కారణం నాన్న పరాలుతో సంసారం చెయ్యటమే.

అప్పుడు నాకు మహాలక్ష్మమ్మగారు, ఆమె కూతురు గుర్తుకు వచ్చి ఆ ఊరు వెళ్ళాను. ఆమెకూతురికింకా పెళ్ళి కాలేదని తెలిసి వాళ్ళింటికెళ్ళి మహాలక్ష్మమ్మగార్ని సూటిగా అడిగేశాను.

"ఏమండీ! మీ అమ్మాయిని నాకిచ్చి పెళ్ళి చెయ్యటానికి ఏమయినా అభ్యంతరాలున్నాయా? అని."

మహాలక్ష్మమ్మగారి ఆశ్చర్యానికీ ఆనందనికి అవధుల్లేవు "మీ నాన్నగారు సరేఅంటే నాకే అభ్యంతరాలూ లేవు. కట్నం కానుకా ఇచ్చి పిల్ల పెళ్ళి ఘనంగానే చేస్తాను అంది." అప్పటికి ఆవిడ తల్లి పోయింది. నాకు కాఫీ ఫలహారం ఇచ్చి తరవాత సుశీలా అని పిలిచింది. లంగా జాకెట్టులో మాత్రమే నాకు తెలుసున్న సుశీల, గులాబిరంగు ఫుల్ వాయిలు చీరలో వచ్చి నా ఎదర నిల్చుని పెదవుల మీద చిరునవ్వు కదులుతూంటగా నమస్కారం చేసింది.

చాయ తక్కువయినా కను ముక్కు తీరులో ముఖం కళగా ఉంది. లావు, సన్నమూ, పొడవు, పొట్టికాని సుశీల నాకు నచ్చింది. పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చాను

ఈవిషయం నాన్నకు చెబితే ఆకాశమంత ఎత్తు ఎగిరి వీల్లేదు పొమ్మన్నారు

మీరు చేసిన నిర్వాకానికి అంతకన్నా మంచి సంబంధం ఎలా వస్తుందని నేను తిరగబడ్డాను.

"నిర్వాకానికేం తక్కువరా? లక్ష రూపాయల ఆస్తి నీపేర రాచాను" అన్నారు.

"అక్కర లేదు. వరాలు గురించి మీరసలు పెళ్ళికి రావద్దు" అన్నాను.

"రాన్లే" అన్నారు నాన్న - ఆగొంతులో బాధ స్పష్టంగా వినిపించింది.

ఆయన, వరాలు రాకుండానే మా పెళ్ళి క్లుప్తంగా జరిగిపోయింది. ఉభయ ఖర్చులూ పెట్టి మహాలక్ష్మమ్మ గారే పెళ్ళి జరిపించేసింది ఆవిడ సంపాదనంతా కూతురుకే కనుక. సుశీల అందమైన చీరలే కడుతుంది. నేను వాయిలు పెళ్లను చీరలే కొంటున్నాను. సుశీల నేత చీర కట్టడం నేనూ చూడలేదు.

నాన్న ఎన్నో సార్లు పెళ్ళి అయిన తరువాత మమ్మల్ని ఆహ్వానించారు. మహాలక్ష్మమ్మగారు "తప్పు ఎంతయినా తండ్రి - వెళ్ళు" అని బలవంతంగా మందలించి, సుశీల కూడా వెళ్దామండీ అని కోరిన మీదట అప్పుడప్పుడు నాన్న ఇంటికి వెళ్ళి వస్తూ ఉండేవాణ్ణి. అమ్మ నాన్నలానే వరాలూ నాన్నా పోట్లాడుకునే వారు. ఎందుకో నాకు తెలియదు. సుశీల అంది ఓ సారి "ఆవిడ కేరక్టరు మంచిది కాదుట, ఎదురింటి చింతపండు షావుకారితో తిరుగుతుందట అందుకే మావగారు" అని అందో లేదో. "ఛీ నోరు ముయ్యి ఇంత వయసు వచ్చింది. ఆవిడ అలాంటిదికాదు" అనేశాను కొంత కాలంగా నాన్న మంచాన్న పడ్డారు. ఓసారి వచ్చి చూసిపో అని చాలా సార్లు ఉత్తరాలు రాశారు. కాని ఎందుకో అతనిమీద నా గుండె లోతుల్లో అసహ్యం. పండగకి ఎలా అయినా ఓసారి రమ్మని నిన్ను పిలవమని ఆయన రాసిన ఉత్తరం చూసి సుశీల నన్ను మందలించి ప్రయాణం కట్టమంది.

వరాలుకీ సుశీలకీ ఘర్షణ. వరాలుకి మా ఆవిడచేత అత్తయ్యా అని పిలిపించుకోవాలని ముచ్చట. మా ఆవిడ ఏమండీ అంటుంది కాని అత్తయ్యా అని పిలవదు.

నాకు బలే చిరాకు వేసింది. వెంటనే ప్రయాణం కట్టేశాను.

మూడు రోజుల తర్వాత లాయరు వెంకట్రావు గారి దగ్గర నుండి టెలిగ్రాం వచ్చింది. నాన్న పోయారని వెంటనే రమ్మనీను.

చితికి నిప్పు అంటించే ముందు నాన్న, అమ్మ అక్కయ్య, అన్నయ్య అందరూ మెదిలారు నాఎదలో లీలగా.

తర్వాత తన ఆస్తి సర్వం నాపేర వ్రాసిన వీలునామా లాయరు వెంకట్రావు చదివి వినిపిస్తూంటే నివ్వెరపోయాను. నాన్నకు నా మీద ఎంత ప్రేమ! తనకేమీ ఇవ్వలేదనీ అన్యాయం చేసి పోయాడనీ నాన్నని తిడుతూ గుండెలు బాదుకుంటూ ఏడ్చేవరాల్ని చింత పండు షావుకారు ఓదారుస్తున్నాడు.

. మహాలక్ష్మమ్మ గారు ఎప్పుడో వీలునామా రాయించింది. తన తదనంతరం ఆస్తి బ్యాంకి ఎకౌంట్లు అన్నీ నాకే దక్కాలని.